# చిగురాకు

ఇంట్లో అందరికీ పేరు పేరునా చెప్పి బయలుదేరింది గంగ. నారాయణ రెండు చేతుల్లోనూ రెండు సంచులు పట్టుకుని ముందు నడుస్తుంటే అతని వెనకే సిగ్గుసిగ్గుగా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ వెళ్తోంది. వరండా అరుగుమీద కూచుని బియ్యం ఏరుకుంటూన్న వాళ్ళూ, చెరువు నుంచి నీళ్ళు తెచ్చుకుంటున్న వాళ్ళూ ముచ్చటగా వాళ్ళనే చూస్తున్నారు. వాళ్ళ చూపులు ఆమెకు గిలిగింతలు పెడుతున్నట్లున్నాయి. వాటిని దొంగ చాటుగా ఏరుకుని మరీ సిగ్గుసిగ్గుగా తనలోకి తనే ముడుచుకుపోయి మెల్ల మెల్లగా అడుగులు వేస్తోంది.

వీధి చివర పెసరట్లు వేస్తోన్న ముసలమ్మదగ్గిర ఇంతవరకూ గట్టిగా తుళ్ళుతున్న రెండు కంఠాలు అకస్మాత్తుగా ఆగిపోయినచోట రాలి పడిన నిశ్శబ్దాన్నీ, తను దాటిపోయిన తర్వాత మళ్ళీ మాటలు పేలాలై ఎగరడాన్నీ ఆమె గుర్తించింది. వాళ్ళ చూపులు వాలినచోట పడిన గుర్తుల్ని చెరిపేస్తున్నట్లుగా ఆమె పవిటను భుజాలమీంచి మెడపక్కగా తిప్పి నిండుగా వేసుకుంది. తలవంచుకుని, పాదాలకింద నలిగిపోతోన్న తన నీడని తనే చూచుకుంటూ నడుస్తోంది.

పడమటీధి దిగువ రావిచెట్టుదగ్గర ఎడంచేతివైపు తిరిగితే అవతల శివాలయ౦ఉంది. శివాలయం గోపురం మీద రాతిలో దేవతలు పచ్చ గన్నేరు చెట్టు గుబురు లోంచి తొంగిచూస్తున్నారు. గంగ అటుచూసి సిగ్గుపడిపోయి తల తిప్పేసుకుంది. పూజారిగారి అమ్మాయి పూలు కోసు కుంటూ "అదేమిటి గంగమ్మా, మా శివయ్యను చూడకుండానే పోతు న్నావ్?" అంది.

గంగ వయసే ఆ అమ్మాయిదీ, చదువువల్లా, నాగరితవల్లా సన్న బడి, నాజూగ్గా తోటకూర కాడలా అనిపిస్తుంది.

ఇప్పుడే వస్తానన్నట్టు కళ్ళతోనే నారాయణకు సంజ్ఞ చేసి గంగ, గుడిలోకి వెళ్ళింది. నారాయణ ఆగకుండానే మెల్లగా నడుస్తున్నాడు. ఓనిమి షంలో ఆమె తిరిగివచ్చి అతన్ని కలుసుకుంది.

"మా శివయ్య అడిగిన వాళ్ళకి అన్నీ యిస్తాడు, లేదనడు. ఇంతకీ ఏ వరం కోరుకున్నావేమిటి?" అన్నాడు నారాయణ. గంగ ఏమీ మాట్లాడ లేదు—నవ్వేసి ఊరుకుంది.

ఇద్దరూ ఆలయం పక్కనేవున్న చెరువుగట్టు ఎక్కి వెళ్తున్నారు. రేవుకాడ ఆడాళ్లు పొద్దెక్కుతోందన్న ధ్యాసకూడా లేక తాపీగా ముచ్చ ట్లాడు కుంటున్నారు. నారాయణ, గంగ వాళ్ళకి మరో పది నిముషాల మేత।

రేవులోంచి వాస్తోన్న సుబ్బయ్య పెళ్ళాం పలకరిస్తే ఆగిపోయి మాట్లాండుతోంది గంగ. ఎంతకీ మాటలు తెమిలేట్టులేవు. నారాయణ వాచీ చూసుకున్నాడు. అతను టైము చూసుకోవడం గంగ గమనించి "వెళ్ళొస్తా" నన్నట్టు చూపుల్తోనే చెప్పి అక్కడ్నించి కదిలింది.

"ఆ...ఆ...మళ్ళీ రావాలి. ఈ వూరి కోడలివి కాదుటే నువ్వు. యిక్కడికి రాక మరెక్కడికి వెళ్తావు గానీ ఆ వచ్చేదేదో త్వరగానే వచ్చేసెయ్" అంది సుబ్బయ్య పెళ్ళాం.

చెరువుమీంచి వీచిన గాలిలో గంగ పవిట చిగురాకులా రెపరెప లాడింది.

ఎగురుతున్న పవిటను వెనుకనించి చుట్టూతిప్పి బొడ్లోదోపుకుంది. గట్టుమీంచి కిందికిదిగి సీతాఫల తుప్పల్లోంచి వేటకుక్కల్లా కదులుతోన్న తమ నీడల్ని విచిత్రంగా చూస్తూ నడుస్తోంది. ముందు వెళ్తున్న నీడ చూస్తుండగానే బాగా ముందుకి వెళ్ళిపోయింది. ఆమె నీడ ఒంటరితనంలో చిక్కుల్ని విప్పుకుని మెల్లమెల్లగా కదుల్తోంది.

నారాయణ ఏదో చెప్పాలని వెనక్కు తిరిగి చూశాడు. గంగ పాతిక గజాల దూరంలోవుంది. పక్కన చూస్తూ నడవడంవల్ల ముందున్న మట్టి గడ్డ తగిలి తూలి పడబోతూ ఆగి, అతను గమనించడం చూసి సిగ్గుతో వుక్కిరిబిక్కిరై పోయింది గంగ.

ఆమెను దగ్గరకు రానిచ్చి "మా వూర్ని విడిచి పెట్టాలనిపించడం లేదేమిటి?" అన్నాడు నారాయణ చిన్నగా నవ్వుతూ.

లోలోపలే నవ్వుకుంది ఆమె. చెరువు నీటిలో, గట్టుమీది పున్నాగ చెట్టు గాలికి రాల్చిన పున్నాగ పువ్వు ఎగిరొచ్చిపడి లేచిన సన్నటి అల లాటి చిరునవ్వు నవ్వింది ఆమె.

గంగ అందగత్తెకాదు కానీ అందంగా నవ్వగలదు. దాచుకుని దాచుకుని పిసినారిలాగ నవ్వుతుంది. ఊరించి ఊరించి తాయిలంతినే చిన్న పిల్లలాగ నవ్వుతుంది. ఆగిఆగి తొలకరి జల్లులాగ సన్నగా నవ్వుతుంది. అందులో అమాయకత వుండదు. ఆరిందాతనం వుంటుంది. మనసును దాగుడుమూత లాడించే నేర్పు వుంటుంది. అందుకే అందులో ఆకర్షణ. చెట్లగుబురుల వెనక వూహా, మేఘాల వెనక చంద్రుడూ, తామరాకుల వెనక తామరపువ్వూ దాగుడుమూతలాడి మనసును దోచుకునే లాటి ఆకర్షణ. ఆ చిరునవ్వే ఆమెకు కలికితురాయి. తాటిచెట్టు తలమీద కమ్మల కిరీటం లాటిదది. ఈ కిరీటమే లేక పోతే తాటిమోడుకు అందమెక్కడిది? అందంలేని వాళ్ళు ఏదో ఒక ఆకర్షణని—చూపుల్లోనో, చిరునవ్వుల్లోనో, పలుకుల్లోనో పెంచుకోక తప్పదు.

"ఇలా అడుగులు లెక్కపెట్టుకుంటూ నడిస్తే ఎండంతా మనమీదే వుంటుంది. కాస్త తొందరగా నడవాలి. అప్పుడే పదయ్యింది" అన్నాడు నారాయణ.

ఇద్దరూ అడుగులు గబగబావేసి నడుస్తున్నారు.

చెరువుకట్టదాటి పుంతలోకి వచ్చారు. ఎండలో మెరిసిపోతోందది. ఎండకి అప్పుడే యిసిక వేడెక్కి పుంతచివర ఎండమావి కదుల్తోంది. ఆమె పాదాలకి చెప్పుల్లేవు. కాళ్లు కాలుతున్నాయి గాబోలు, యిబ్బందిగా నడుస్తోంది. నారాయణ ఆ విషయం గుర్తించాడు.

"చెప్పుల్లేవా నీకు?" అన్నాడు.

లేవన్నట్లు తలాడించింది ఆమె.

"భలేదానివే. చెప్పుల్లేకుండా ఆ లంకలో ఎలా వుంటున్నావ్. ఆనక రాజోలులో కొంటానుండు. మా చెల్లెలు ఆదే కదూ నీదీనీ. ఎవరన్నా లంకలోకి వెళ్ళేవాళ్లుంటే వాళ్ళచేత పంపిస్తాలే. మా హైదరాబాదులో యిలా చెప్పుల్లేకుండా నడిస్తే నవ్వుతారు తెలుసా. అక్కడ అడుక్కునే వాళ్లు కూడా చెప్పులేసుకుంటారు."

"అలాగా" అన్నట్టు కళ్లు రెంటినీ పువ్వుల్లా విచ్చుకుని చూసింది.

"ఏం వూరనుకున్నావ్ అది! కళ్లు చెదిరిపోతాయనుకో. పొద్దున్నా, సాయంకాలం ఆడళ్లూ మగాళ్ళూ కంగారు కంగారుగా పోతూండం చూస్తే నిజంగా మన గోదావరికి వరదొచ్చినట్లే వుంటుంది!పూజారిగారి అమ్మాయి కన్నా అందమైన అమ్మాయిలు, అంతకన్న నాజూకైనవాళ్లు, ఫేషనువాళ్లు ఎంతమందో అక్కడ..."

అమలాపురం కంటె పెద్దవూరుని ఎప్పుడూ చూడలేదు గంగ. చిన్నప్పుడు పుష్కరాలకి రాజమండ్రి వెళ్ళిందిగానీ అదామెకు జ్ఞాపకం లేదు. నారాయణ చెప్తోంటే ఆమె కళ్ళముందు అందమైన రంగుల నగరం మెరుస్తోంది.

నారాయణ చెప్తున్నవాడల్లా చటుక్కున ఆగిపోయి సంచి కిందపెట్టి, యిసకలోంచి దేన్నోతీసి అరచేతిలో వుంచుకుని పట్టిపట్టి చూస్తూ వుండి పోయాడు. గంగ దగ్గరకొచ్చి అతని అరచేతిలోకి చూసింది.

చచ్చిపోయిన సీతాకోక చిలుక అది!

ఎర్రటి మచ్చలు, ఆ చుట్టూ నలుపు, పక్కలకు చెదిరిపోయిన ఉదారంగు_పల్చటి రెక్కలు గాలికి చలిస్తున్నాయి.

"ఎంత బావుందో చూడు" అన్నాడు ఆమె ముఖానికిదగ్గరగాపెట్టి.

ఉఫ్‌మంటూ వూదిందామె. సీతాకోక చిలుక కిందపడిపోయింది. దాన్ని మళ్ళీ తీసుకుని బయలు దేరాడు. ఆమె అతని పక్కనేనడుస్తోంది.

"నీకు జ్ఞాపకం ఉందా. చిన్నప్పుడు అరటి తోటలో తూనీగల్ని పట్టుకుని ఆడుకునేవాళ్ళం. ఓ సారి తూనీగను వేటాడుతూ, పరుగెత్తి బ్రహ్మజెముడు డొంకమీద పడిపోయాను. వొంటినిండా ముళ్ళు గుచ్చుకు పోయాయి. నువ్వేగాబోలు ముళ్ళన్నీ జాగ్రత్తగాతీసి అన్నీ నా చేతి కిచ్చావు. అబ్బో! ఎన్నిముళ్ళో..."

ఆమె ఆలోచనలు తూనీగల్లాగ ఎగిరిపోయాయి. 'అవును, జ్ఞాపకం వచ్చింది'___ అన్నట్టు గతంలోంచి తొంగిచూస్తూ, చిరునవ్వు నవ్వి తలాడించింది.

ఆమె ముఖంమీదకు జారిన లేత ముంగురులు గాలికి ఊరికే పులక రించి గిలిగింతలు పెడుతోంటే ఆమె వాటిని వెనక్కు నెట్టి గట్టిగా అణి చిందిగాని అవి నిలకడగా వుండక మళ్ళీ ఎగిరిపడుతున్నాయి.

పుంత చివరే కాలవ వుంది. అందుకే తెరలు తెరలుగా గాలి వీస్తోంది. అయిదునిమిషాల్లో యిద్దరూ కాలవదగ్గరికి వచ్చారు. కాలవలో ఒక్కచుక్కన్నా నీళ్లలేవు! లాకులు యింకా విప్పలేదు. విప్పితేగాని కాలవలోకి నీళురావు. మన్నుతిన్న జెర్రిగొడ్డులాగ వుంది కాలవ. ఇదే మళ్ళీ వర్షకాలం వచ్చేసరికి కృష్ణ సర్పంలాగ బుసలు కొడుతుంది!

కాలవ అవతలి గట్టుమీద చింతచెట్టు చల్లని నీడని కురిపిస్తోంది పశువుల్ని కాసుకునే యిద్దరు కుర్రాళ్లు ఆ పక్కనేవున్న జీడిమామిడి తోటలోకి పశువుల్ని తోలేసి, చింతచెట్టు నీడలో బిళ్ళంగోడు ఆడుకుంటు న్నారు. ఓ ముసలమ్మ వచ్చి జీడిపిక్కల గంప దించుకుని నీడలో చతికిల బడి ఎవరిగురించో ఎదురు చూస్తోంది.

"మనమూ ఓ అయిదు నిముషాలు ఆగి వెళ్దాం. ఎండ ఎలాగుందో చూడూ పేలాలు పేలుస్తోంది" అంటూ నారాయణ సంచులు కింద పెట్టి ఓసారి జేబు రుమాలతో ముఖంమీది చెమట తుడుచుకున్నాడు. సిగరెట్టు తీసి వెలిగించుకున్నాడు. ఆమెకుకూడా కాళ్లు లాగినట్టున్నాయి, చెట్టు మొదట్లో వేరుమీద చతికిలబడింది.

నారాయణ అటూ ఇటూ పచార్లుచేసి కింద పడివున్న ఓ చింత బొట్ట పట్టుకొచ్చాడు. "తింటావా... తిను, దాహం కడుతుంది." అంటూ ఆమెకిచ్చాడు. ఆమె తీసుకుని దాన్నే చూస్తూ కూర్చుంది.

"తినవేం... నీకక్కర్లేకపోతే పోనీ ఇలా ఇవ్వు. నేను తింటాను" అన్నాడు నారాయణ.

ఆమె చింతబొట్ట విరిచి తను ఓ పిక్క మాత్రం తీసుకుని, మిగ తాది అతనికి ఇచ్చేసింది. ఆ పిక్కను నోట్లో వేసుకుని చప్పరిస్తూ కళ్లు చిట్లించి మూతిని అష్ట వంకర్లూ తిప్పేస్తుంటే అతనికి విపరీతంగా నవ్వొచ్చింది. "చిన్నప్పుడు నువ్వు ఇంతింత చింతపండు తినేదానివి కదూ. నాకింకా జ్ఞాపకమే. దొంగచాటుగా ఇంట్లోంచి తెచ్చిస్తే, అందులో ఉప్పేసి, వుండలు వుండలుగా చేసి ఇచ్చేవాడ్ని. అలా చేసిపెట్టినందుకు సగం వుండలు లంచం తీసుకునేవాడ్ని. అబ్బ! రోజుకి ఇంతింత చింత పండు ముద్దలు తినేసేవాళ్ళం. ఆ విషయాలు తలచుకొంటుంటే భలే నవ్వొస్తుంది నాకు."

గంగ చూపులు ఒకేచోట స్థిరంగా నిలిచి పోయాయి. ఆమె గతం లోకి చూస్తోందో, లేక ఆ ఎదుటి డొంకవేపు చూస్తోందోమరి స్పష్టంగా తెలీడంలేదు.

ఆమె చూపుల ఎదుటమాత్రం సన్నటి తీగ ఒకటి బ్రహ్మజెముడు పట్టమీంచి కిందకు వేలాడుతోంది. ఏకాస్త పిల్లగాలివొచ్చి గుసగుసలాడినా పులకరించి పోతున్నట్టు చలించి పోతోందది!

అయిదు నిముషాలు కూచుని మళ్ళీ బయలుదేరారు వాళ్లు ఇంకా మైలుదూరం వెళ్తేగాని గోదావరి గట్టు తగలదు. గట్టువరకూ అన్నీ కొబ్బరితోటలూ, సరుగుడు తోటలూను, మధ్యమధ్య తోటల్లోనే ఇళ్లు తగులుతున్నాయి. ఎంత బాధమాత్రం తప్పింది. దారి పొడుగునా కొబ్బరి చెట్లు గొడుగుపట్టి నిలుచున్నాయి. గోదావరి గాలికి తలలూపుతున్నాయవి. కచ్చాబాట పోను పోను వెడల్పయింది. బాటమీదకే ఇరువైపులా చెరి పాతిక గడపతో రెండు వరసలున్నాయి సింగిల్ టీ దుకాణమూ, సోడా బడీకూడా వున్నాయి. అక్కడ ఆగి ఇద్దరూ రంగుసోడాలు తాగారు. స్ట్రాంగ్ పిప్పరమెంట్ల పేకెట్టు ఒకటి తీసుకుని సగం ఆమెకిచ్చి తను సగం జేబులో వేసుకున్నాడు.

ఆమెకు చాలా సిగ్గుగా వుంది. కిళ్ళీబడ్డీదగ్గరా, ఆ పక్క రావి చెట్టుకిందా చాలామంది మగాళ్లు వాళ్ళనే చూస్తున్నారు. లంకలోంచి పుచ్చ కాయల కావిడి మోసుకొస్తోన్న సీతయ్యా, రాములూ కావిళ్లు దించుకుని సింగిల్ టీకొట్లో టీ తాగుతూ ఇటే చూస్తున్నారు. వాళ్ళ ఎదురుగా పట్నం పోళ్ళలాగ రంగు సోడాలు తాగాలంటేనూ, పిప్పరమెంట్లు తినాలంటేనూ ఆమెకు అదోలా వుంది. కాని నారాయణ బలంతం చేస్తే ఆమెకు రంగు సోడా తాగకా తప్పలేదు, పిప్పరమెంట్లు తినకా తప్పలేదు.

అక్కడ్నుంచి బయలుదేరుతున్నప్పుడు "కాస్త హుషారుగా అడుగు వెయ్యి. భోజనం టయిముకు లంక చేరుకోవచ్చు. అన్నంతిని. ఓ గంట నడుం వాల్చి మళ్ళీ నేను రాజోలు వెళ్ళాలి, పనుంది" అన్నాడు నారాయణ. ఆమె హుషారుగానే నడుస్తోంది. ఇళ్లుకూడా దాటేశారు. మళ్ళీ తోటలు...

ఎడంపక్క జనపచేను నిలువెత్తు ఎదిగి కోతకు సిద్ధంగా వుంది. పసుప్పచ్చ పూలను సిగల్లో తురుముకుని, పక్కనే వున్న సరుగుడుతోట

ఆలపిస్తోన్న గానానికి పరవశించిపోయి మత్తుగా ఊగుతున్నాయి మొక్కలు గాలి తెరలకు చేనులో సముద్ర కెరటాల్లా అలలు కదులుతున్నాయి.

గంగ చూపులన్నీ ఆ చేనుమీదే వున్నాయి. ఎండలో మెరిసి పోతోన్న జనప పూలు ఆమె కంటిపాపల్లో పసుప్పచ్చ నక్షత్రాల్లా నిలిచి పోయాయి!

ఆ పక్కనే చెరువుంది. చెరువుకింద యిటు వైపు జనప చేను సాగవుతోంది. అవతలిపక్క అరటితోట వేశారు. చెరువునిండా తామర తూడు కమ్ముకుంది. అక్కడక్కడ తామర పూలు తలెత్తి చూస్తున్నాయి. కాస్త సేదదీరినట్టు వుంటుందని నారాయణ చెరువులోకి దిగి కాళ్ళు చేతులూ ముఖమూ కడుక్కున్నాడు. ఆమెను రమ్మన్నాడు గాని రాలేదు. గట్టుమీద నిద్ర గన్నేరు చెట్టునీడలో నిలుచుని చెరువులో కో కొల్లలుగా వున్న తూటు పూలను చూస్తోంది. తామరాకులతో పచ్చటి తివాసీలా వున్న చెరువుగట్టుకు చేరువగా చుట్టూ గల తూటుపూలు ఊదారంగు అంచులా అనిపిస్తున్నాయి!

నారాయణ ఆమె చూపుల్ని గుర్తించి "కావాలా...కోసివ్వనా" అంటూ ఆమె సమాధానమన్నా వినకుండా గుప్పెటలో పట్టినన్ని పూలు కోసుకొచ్చాడు. "తలలో పెట్టుకోడానికి యివి కూడా బాగానే వుంటాయి. నువ్వెప్పుడైనా పెట్టుకున్నావా వీటిని. మనకు అలవాటు లేదుగానీ ఊదా రంగు పూలు నల్లటి జడమీద ఎంత అందంగా వుంటాయనుకున్నావ్! నాకెందుకో ఊదారంగంటే భలే యిష్టం."

గంగ తను కట్టుకున్న ఊదారంగు కొత్తచీర వైపు చూసుకుని నవ్వుకుంది.

పొద్దున్న బయలుదేరి వస్తున్నప్పుడు చీరా, జాకెట్టు గుడ్డా, అయిదు రూపాయలూ చేతిలో పెట్టారు ఇంట్లో చీరకట్టుకుని మరీబయలు దేరమన్నారు. గంగ చీరలు ఎక్కువగాకట్టదు. వోణీలే వేసుంది. చీర కట్టు కుంటే ఎంతో పెద్దదానిలా అయిపోయినట్టనిపిస్తుంది ఆమెకు. ఎప్పుడో

పండక్కూ, పబ్బానికీ తప్ప చీరలు కట్టదు. పొద్దున్న కట్టుకుని వెళ్ళా లంటే కట్టుకుంది. నిజానికి ఊదారంగంటే ఆమెకు అంత మనసులేదు. సింధూరం లాంటి ఎరుపన్నా, చిలకాకుపచ్చన్నా ఆమెకు చాలా యిష్టం.

ఆమె మరోసారి ఒంటిమీద చీరకేసి చూసుకుంది. ఆ రంగు బాగానే వున్నట్టనిపించింది. ఆ పూలు కూడా చాలా చక్కగా కంటి కింపుగానే వున్నాయి.

పూలు తీసుకుని తలలో పెట్టుకుంది. పెట్టుకుంటూ, నీళ్ళలో బుడ్ మన్న శబ్దం వస్తే ఏమిటో అని చూసింది ఆమె. నారాయణ చెరువులోకి మట్టిబెడ్డ ఏదో విసిరినట్టున్నాడు, చక్రాలు చక్రాలుగా అలలులేచి నిశ్చలమైన చెరువంతా వ్యాపిస్తున్నాయి.

ఇక బయలుదేరుదాం అన్నట్టు అతను కదిలాడు. ఆ వెనకే ఆమె కూడా.

చెరువుకట్టమీంచి వెళ్ళి అరటితోట పంట బోదెమీదుగా నడిచి గాలికి తెరచాపల్లా ఎగిరే అరటాకుల రెపరెపల్ని వింటూ, తోటలో తిరిగే తుమ్మెదల్ని చూసుకుంటూ గోదావరి గట్టు చేరుకున్నారు. గట్టుమీంచి చూస్తే పల్లంలో వున్న అరటితోట, దాని అవతల చెరువు, ఆ పక్కనే జనపచేను, ఇంకాపైన కొబ్బరిచెట్ల మధ్య తొంగిచూస్తోన్న పాకలు, మధ్య మధ్య సర్వీ తోటలు—యిప్పుడు నడిచివచ్చిన దారంతా నీడల్తో మరీ అందంగా కనిపిస్తోంది.

వెళ్ళాల్సిన దూరం యిక అట్టేలేదు. గట్టుమీంచి కాస్త దూరం వెళ్తే లంక అవతలిగట్టు ఎదురుగ్గా కనబడుతుంది. గోదావరి దాటడానికి అక్కడ పడవవుంటుంది. ఎప్పుడూ ఎవరో ఒకరు వొస్తూపోతూనే ఉంటారు.

నారాయణ, గంగ గోదావరి గట్టుమీంచి నడుస్తున్నారు. గట్టుమీద నీడనిచ్చే పెద్ద చెట్లేమీ లేవు. చిగురుపడుతోన్న తుమ్మ చెట్లు మాత్రం వున్నాయి. సీతాఫల మొక్కలు కూడా ఆకుల్ని రాల్చేసుకుని యిప్పు

చిప్పుడే చిగురు పెడ్తున్నాయి. సూర్యుడు తలమీదకు వచ్చేశాడు. గోదావరి మీంచి ఉధృతంగా గాలైతే వీస్తోందిగాని గాడ్పు గాలది. వెచ్చగా గూబల్లో కొడ్తోంది. గోదావరి బాగా తెప్పతేలిపోయిందేమో యిసకంతా కాలి కాలి, అటునించి వొచ్చే గాలి అంతా మరీ వెచ్చగా కొడ్తోంది.

గంగ బొడ్లో దోపుకున్న పవిటచెంగుతీసి తలమీద ముసుగులా కప్పుకుంది. కిందపాదాలు చుర్రుమంటున్నాయి గాబోలు పొడుగాటి నారాయణ నీడలోకి ఒదిగి ఒదిగి అతని పక్కనే నడుస్తోంది. గాలికి బట్టలన్నీ టపటపా కొట్టుకుంటున్నాయి. అతని తలంతా చెదిరిపోయి కళ్ళల్లో పడుతోంది. ముఖమంతా చెమట పట్టేసి జిడ్డుదేరిపోయింది. గబగబా అడుగులు తేల్చివేస్తూ నడుస్తున్నాడు. ఆమె కూడా అతనితోపాటు నడుస్తోంది. ఆయాసంతో వగరుస్తోంది.

ఓ చోట గట్టుమీదికి దయగా జారిన తారాసంత నీడలోనూ ముడుచుకుపోయినట్టు నిలుచున్న ఓ ముసలితాత. వీళ్ళగురించే ఎదురుచూస్తూ దగ్గరకు రాగానే "దండాలు బాబయ్యా" అంటూ ముందుకొచ్చాడు. అతని గెడ్డాం పిచ్చితుప్పలా వుంది. ఒంటిమీద పైకి ఎగట్టిన పంచె తప్ప యింకేమీలేదు చేతిలో ఓ కర్ర వుంది. పశువుల్ని మేపుకుంటున్నాడేమో మరి గట్టుకింద ఆవులు కనిపించాయి.

నారాయణ ఆగిపోయి "ఏం?" అన్నట్టు చూశాడు.

"చ్చమించండి బాబయ్యా...సుట్ట కాలుద్దారని...నిప్పెట్టె ఓ పాలి యిప్పిచ్చండి అయ్యగోరో" అన్నాడు. డబ్బులు అడుక్కునే ముష్టివాడి మాటల్లో కూడా లేనంత దీనంగా అడిగేసరికి నారాయణ మనస్సు చివుక్కుమంది. మారు మాట్లాడకుండా సంచి కిందపెట్టి అగ్గిపెట్టె తీసిచ్చాడు.

"యాడకి బాబుగారో ఎల్తున్నారు" అన్నాడు తాత అగ్గిపెట్టె తీసుకుంటూ.

"లంకలోకి" అన్నాడు నారాయణ.

కథా నిలయం
శ్రీకాకుళం

గంగ ఆ ప్రక్కనేవున్న కొద్దిపాటి నీడలోకి వెళ్ళి నిలుచుంది. కాళ్ళ దగ్గర పాలపిట్ట ఈక ఒకటి కనిపిస్తే తీసి అరిచేతిలో పెట్టుకుని చూస్తోంది. బహుశా ఆమె కళ్ళల్లో పాలపిట్ట రంగుచీర మెదులుతుందేమోమరి ముచ్చటగా దాన్నే చూస్తోంది.

తాత చుట్ట వెలిగించుకుని అగ్గిపెట్టె తిరిగి యిచ్చేస్తూ—

"లంకలో వోరింటికి బాబయ్యా ఎల్తున్నారు?" అన్నాడు.

నారాయణ సమాధానం చెప్పాడు.

"ఆరి అల్లుడుగారా మీరు?"

"కాదు, మేనల్లుడ్ని" అంటూ సంచులు తీసుకుని అక్కడ్నించి కదిలాడు.

గంగ చేతిలో పాలపిట్ట ఈక గాలికి ఎగిరి అలా అలా తేలి దూరంగా వెళ్ళిపోయింది.

గంగ, నారాయణ పెదమామ కూతురు. నారాయణ చెల్లెలి పెళ్ళికి వొచ్చిన మేనమామా వాళ్ళూ యితర బంధువులతోపాటు పెళ్ళయిపోయాక వెళ్ళిపోయారు. అమ్మాయిని వారంరోజుల తర్వాత పంపిస్తామంటే గంగను వుంచేశారు. పదిరోజులు వుంచి యిప్పుడు పంపిస్తున్నారు. మొదట్లో గంగవాళ్ళూ యిక్కడే వుండేవారు. ఏడేళ్ళ కిందటే ఆస్తుల పంపకంలో అన్నదమ్ముల మధ్య గొడవలొచ్చి పెదతను తెగతెంపులు చేసుకుని లంకలోకి కాపురం మార్చేశాడు. ఇంతా చేస్తే నాలుగు మైళ్ళ దూరంకూడా లేదు లంక.

నారాయణ లంకవైపు వచ్చికూడా మూడేళ్ళయ్యింది. హైదరాబాదు వెళ్ళకముందు అప్పుడప్పుడు వస్తుండేవాడు. స్కూలు ఫైనల్ అయిపోయాక రోజూ రాజోలు వెళ్ళి టైపు నేర్చుకున్నాడు. మూడేళ్ళ కిందటే హైదరాబాదులో టైపిస్టుగా వుద్యోగం వచ్చింది. వెళ్ళిపోయాడు.

మూడేళ్ళలోనూ మూడు నాలుగుసార్లు స్వగ్రామం వొచ్చినా హడావుడిగానే వెళ్ళిపోతుండేవాడు. మేనమామ వాళ్ళింటికి ఎప్పుడూ వెళ్ళలేదు.

చెల్లెలు పెళ్ళంటే పదిహేను రోజులు సెలవు పెట్టి వచ్చాడు. అప్పుడే పన్నెండు రోజులై పోయింది. ఇవ్వాళ లక్ష్మివారం. ఆదివారం తిరిగి బైలుదేరాల్సి వుంది. పిల్లను దిగబెట్టినట్టూ వుంటుంది, ఒకసారి మేనమామ వాళ్ళింటికి వెళ్ళినట్టూ వుంటుందని తండ్రి అంటే నారాయణ బయలుదేరాడు. అదీగాక వచ్చేటప్పుడు అలా రాజోలు వెళ్ళి తండ్రికి మందులేవో కొని పట్టుకరావాలి. ఆయన ఆరోగ్యం బావుండటం లేదు.

నారాయణ, గంగా రేవు దగ్గరికి వొచ్చేశారు. ఎదురుగ్గా లంక కనపడుతోంది. పడవ, లంకగట్టున ఎవర్నో ఎక్కించుకుంటోంది. ఇవతలి రేవు చేరేసరికి అయిదు నిమిషాలైనా పడుతుందేమో.

ఇద్దరూ రావిచెట్టు నీడలో కూచున్నారు. మాటల్లేవు. ఆమె గోదావరి నీళ్ళల్లోకి చూస్తోంది. అతను దగ్గరున్న గులకరాళ్ళను అందుకుని నీళ్ళల్లోకి విసురుతున్నాడు. నీళ్ళల్లో చక్రాల్లాంటి అలలు లేస్తున్నాయి. వెళ్ళనంత దూరమూ వెళ్ళి అదే నీళ్ళల్లో కలిసిపోతున్నాయి. ఆమె వాటికేసి రెప్పెయ్యకుండా చూస్తోంది.

పడవ వచ్చేసింది. జనం దిగిపోయాక ఇద్దరూ పడవలోకి ఎక్కారు. వచ్చిన పడవ మళ్ళీ లంకవేపు కదిలింది. నీళ్ళని కోసుకుంటూ లంక గట్టు చేరుకుంది.

పడవ దిగి యిసకతెప్ప ఎక్కి యింటికి బయలుదేరారు. అడ్డదారిలో అయితే యిల్లు ఫర్లాంగు దూరమే. గడ్డిదుబ్బలూ, ముళ్ళ తుప్పలూ, పిచ్చి మొక్కలూ దాటుకుంటూ వెళ్తున్నారు.

"మూడేళ్లు పైబడిందనుకుంటాను లంకలోకొచ్చి. మీ లంక చాలా బావుంటుంది సుమీ. ఎప్పుడైనా వచ్చి ఓ నెలరోజులు వుండాలని వుంది. పెళ్ళయ్యాక వస్తాంలే. మీ యింట్లోనే మకాం పెడ్తాం. వంటదీ శాంతకి నువ్వే నేర్పాలి సుమీ. ఆమెకు వంట సరిగా చేతకాదట ఈ రోజుల్లో

వుద్యోగం చేసే ఆడాళ్ళకి వంటేం వొస్తుంది కనకా. చాలా మంచి అమ్మాయిలే. ఆస్పత్రిలో నరుసు. నేను వుంటున్న గదికి ఎదురింటిలోనే వుంటోంది......"

"అబ్బా!" అది గంగ బాధతో చుట్టుకుపోయి.

ఏమిటన్నట్టు చూశాడు అతను.

ఆగిపోయి పాదంలో గుచ్చుకున్న ముల్లు జాగ్రత్తగా తీసేసింది. ముల్లు గట్టిగానే గుచ్చుకున్నట్టుంది, తీసెయ్యగానే రక్తం చిమ్మింది. రక్తం కారకుండా ఓ నిముషం సేపు వేలితో గట్టిగా అదిమిపట్టింది.

"అందుకే అన్నాను చుట్టు తిరిగి వెళ్దామని. వినలేదు నువ్వు. గట్టిగా గుచ్చుకున్నట్టుంది గాబోలు, బాధ పెడుతోందా?"

గంగ మాట్లాడలేదు. పాదాన్ని మెల్లగా ఆన్చి మడం పైకెత్తి కొద్దిగా కుంటుతున్నట్టు నడుస్తూ బైలుదేరింది.

ఇంటిని చేరుకున్నారు.

"కుంటుతున్నావేమే?" అంది తల్లి.

"దార్లో ముల్లుగుచ్చుకుందత్తా" అన్నాడు నారాయణ.

"కళ్ళు నెత్తిమీద పెట్టుకుని నడిస్తే ఏమవుతుంది మరి– ముల్లయినా గుచ్చుకుంటుంది, పామైనా కరుస్తుంది" అంది ఆమె.

నారాయణ భోజనంచేసి కాస్సేపు నడుం వాల్చాడు. అలసివున్నాడేమో బాగానే నిద్ర పట్టేసింది.

నాలుగింటికి లేచాడు.

మేనమామ పుచ్చకాయలు కోసిపెడితే తిన్నాడు.

రాత్రికి వుండిపొమ్మంటున్నా వినకుండా పనుందని చెప్పి, బయలు దేరడానికి సిద్ధమయ్యాడు. మేనమామ, మేనత్తకు చెప్పాడు. గంగ కని పించలేదు.

మేనత్తను అడిగితే "దొడ్డి వసారాలో పడుకుంది, తలనొప్పొచ్చిందట. ఎండబడి వొచ్చారు కదూ" అంది.

నారాయణ వసారాలోకి వచ్చాడు. గంగ నిద్రపోతోంది. రెండు మూడు పిలుపులు పిలిచినా లేవలేదు.

"మొద్దుముండ, అప్పుడే నిద్రట్టేసిందా. ఇంతకు ముందువరకూ తెలిగేసే వుందికదూ. ఎంత తొందరగా నిద్రడుతుందో దీనికి" అంది. అలా అంటూనే వసారాలోకొచ్చి లేపబోతోంటే "ఎందుకులే, వొద్దు; తల నెప్పి అన్నావుగా పడుకోనీ" అని చెప్పి బైలుదేరాడు నారాయణ.

లంక వొడ్డుకొచ్చి పడవ యెక్కాడు.

పడవ అవతలి గట్టువైపు కదిలింది.

గట్టుమీద చిగురుపట్టిన రావిచెట్టు ఆకులు గాలికి రెపరెపలాడుతూ కనిపిస్తున్నాయి.

యవ్వనంలో అడుగు పెడుతున్న కన్నెమనసులాంటి రావాకు చిరుగాలికి సైతం పులకరించిపోతోంది!

చటుక్కున అతని కళ్ళముందు ప్రవాహపు వొరవడి మందగించి కదల్లేక తనలోకి తనే ముడుచుకుపోయినట్టు పడుకున్న గంగ కనిపించింది.

ఆమె ఎందుకు పడుకుందో యిప్పుడు అతనికి అర్థమైంది.

* * *